క్లుప్తంగా

రూ.20లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లోని శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానం వీధిలో రూ.20లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శ్రీనివాస లేఅవుట్లో పర్యటించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి స్థానికులు, భక్తులు సీసీరోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి కాకాణి నుడా నిధులు రూ.20 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో 14 అడుగుల సీసీరోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు.

ఖాళీ స్థలాల లీజుకు టెండర్ల ఆహ్వానం

నెల్లూరు సిటీ : ఆర్టీసీ నెల్లూరు జోన్ – 3 పరిధిలోని ఐదు జిల్లాల్లో 14 ఖాళీ స్థలాలకు 15 ఏళ్ల పాటు వ్యాపార నిమిత్తం అద్దె ప్రాతిపదికన లీజుకు ఇచ్చేందుకు ఈ నెల 7, 8వ తేదీల్లో టెండర్ ఫారాలను ఈడీ కార్యాలయంలో ఉండే టెండర్ బాక్సుల్లో వేయాలని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదామ్ సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు టెండర్ ఫారాలను వేయాలని సూచించారు. ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఉలవపాడులో ఉన్న ఖాళీ స్థలాలకు టెండర్లను నిర్వహిస్తున్నామని చెప్పారు.

స్విమ్మింగ్ జట్ల ఎంపిక



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్విమ్మింగ్ సీనియర్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికలను జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గల స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేశామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుంకర మధు, సనత్ తెలిపారు. నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన గాండ్ల కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు కోరారు. నగరంలోని దేవిశెట్టి స్వాములు కల్యాణ మండపంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. పదో తరగతి, సీనియర్ ఇంటర్‌లో జిల్లా స్థాయిలో అధిక మార్కులు సాధించిన గాండ్ల సామాజికవర్గ విద్యార్థులకు గోల్డ్ మెడల్, నగదు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు, తదితరాలను దివంగత గ్రోసు గోపాలయ్య పేరిట అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన గాండ్ల, తెలికుల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను రెండేళ్లుగా అందజేస్తున్నామని వివరించారు. సంక్షేమ సంఘ నేతలు అనంత్, మధుసూదన్, నాగరాజు, సత్యనారాయణ, భవానీప్రియ, వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.

వెన్నెలకంటి సేవలు చిరస్మరణీయం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): పద్మభూషణ్ వెన్నెలకంటి రాఘవయ్య సేవలు చిరస్మరణీయమని యానాదుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య పేర్కొన్నారు. వెన్నెలకంటి రాఘవయ్య జయంతిని పురస్కరించుకొని నక్కలోళ్ల సెంటర్ సమీపంలోని రాఘవయ్య భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యానా దుల సంక్షేమ సంఘం, గిరిజన ఉద్యోగుల సంఘ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నేతలు ఉషా, శ్రీనివాసరావు, శీను, మురళి, నారాయణ, పెంచలప్రసాద్, కేశవరావు, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడాన్ని అలవర్చుకోవాలి

నెల్లూరు(టౌన్): చిన్నతనం నుంచే మొక్కలు నాటడాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ఎంజీబీ మాల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని సాయి మిలీనియం స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కరస్పాండెంట్ అజిత, తదితరులు పాల్గొన్నారు.

అద్దె ఇంట్లో ఇబ్బందులు పడ్డాం



ఈ ఫొటోలోని మహిళ పేరు ఆదిరెడ్డి రాజేశ్వరమ్మ. కూలీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తోంది. ఈమెకు సొంతిల్లు లేదు. గత 17 ఏళ్లుగా అద్దె గృహంలో ఉంటోంది. గతంలో పలుమార్లు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నా సొంతింటి కల నెరవేరలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్ నిర్మించి నివేశన స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేశారు. ప్రభుత్వమే ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇచ్చింది. జగనన్న సొంతింటి ఆస్తిని కల్పించడంతో అద్దె ఇంట్లో పడిన ఇబ్బందులను మరిచిపోయానని రాజేశ్వరమ్మ సంతోషంగా చెబుతోంది. ఎన్నో ఏళ్ల సొంతింటి కలను నెరవేర్చిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

జగన్ మనువడి పుణ్యమే



ఈ ఫొటోలోని వృద్ధురాలి పేరు సోమిరెడ్డి సుబ్బమ్మ. ఈమెకు భర్త లేరు. కుమార్తెలు వివాహాలు చేసుకుని వెళ్లిపోవడంతో ఒంటరిగా ఉంటోంది. ఈమెకు సొంతిల్లు లేకపోవడంతో మరొకరి పంచన ఉంటోంది. గత 20 ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తోంది. ఇటీవల గ్రామానికి వచ్చిన అధికారులకు ఇంటి కోసం వినతిపత్రం ఇవ్వగా, వెంటనే జగనన్న కాలనీలో నివేశన స్థలం మంజూరు చేశారు. ఇల్లు కట్టించి ఇచ్చారు. ఇప్పుడు తన సొంతింటిలో దర్జాగా బతుకుతున్నానని, మరొకరిపై ఆధార పడకుండా జీవనం సాగిస్తున్నానని గర్వంగా చెబుతోంది సుబ్బమ్మ. ప్రాణం పోయేలోపైనా ఇల్లు వస్తుందా..రాదా అని ఎదురుచూసిన తనకు సొంతిల్లు తన మనువడు జగన్ పుణ్యమేనని సంతోషం వ్యక్తం చేస్తోంది.

అద్దె ఇంటి నుంచి సొంతింటికి

పేదల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్ సాకారం చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా సొంత గూడుకు నోచుకోక అద్దె ఇళ్లలో ఉంటున్న వారికి జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాలను అందజేశారు. గృహాలను నిర్మించి ఇచ్చి సొంత ఆస్తిని కల్పించారు. ప్రాణం పోయేలోగా సొంతింటి కల సాకారమవుతుందా.. సొంతంగా ఇళ్లు కట్టుకోగలమా అనే పేదల సందేహాలను పటాపంచలు చేస్తూ సొంతింటి కలను నెరవేర్చడంపై బుచ్చిరెడ్డిపాళెం మండలం రెడ్డిపాళెంవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- పేదల సొంతింటి కల సాకారం
- జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాలు.. గృహాలు మంజూరు
- సొంత ఆస్తిని కల్పించిన సీఎం వైఎస్ జగన్



రెడ్డిపాళెంలో జగనన్న కాలనీలో నిర్మించిన గృహాలు

బుచ్చిరెడ్డిపాళెం: పేదల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. నవరత్నాల్లో భాగంగా అర్హులైన ప్రతిఒక్కరికీ గూడు కల్పించాలనే ఉద్దేశంతో జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. అందులో మహిళలకు ఇళ్ల పట్టాలను అందజేశారు. గృహాలను మంజూరు చేశారు. పేదలకు ఉచితంగా నిర్మించి ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా మండలంలోని రెడ్డిపాళెంలో సొంత ఇళ్లు లేని దాదాపు 49 మంది లబ్ధిదారులను గుర్తించి జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఇళ్ల పట్టాలు అందజేశారు. గృహాల నిర్మాణానికి రూ.1.80లక్షలు మంజూరు చేశారు. సొంతంగా నిర్మించుకోలేని పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం 29 ఇళ్లను పూర్తి చేసుకుని లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేశారు. అద్దె ఇంటి నుంచి సొంతింటికి మారి సంతోషంగా జీవితాన్ని గడుపుతున్నారు.

ప్రాణంపోయేలోగానైనా..

ఎన్ని ప్రభుత్వాలు మారినా సొంతింటి కలకు నోచుకోక కొందరు అద్దె ఇళ్లలోనే నివాసం ఉంటున్నారు. మరి కొందరు ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో పూరి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరిలో తమ ప్రాణాలు పోయేలోగానైనా సొంతింటి కల నెరవేరుతుందా..లేదా అనే అనుమానం ఉండేది. సీఎం వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత నవరత్నాల్లో భాగంగా అర్హులందరికీ సొంతింటి కలను సాకారం చేయాలని సంకల్పించి జగనన్న లేఅవుట్లును సిద్ధం చేశారు. అందులో నివే



శన స్థలం ఇవ్వడంతో పాటు ఇళ్లను నిర్మించి ఇచ్చి సొంత ఆస్తిని కల్పించారు. దీంతో చివరి దశలో సొంతగూడు లభించిందని వృద్ధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు కారణమైన సీఎం వైఎస్ జగన్‌ను తమ మనుమడిగా చూసుకుంటూ మురిసిపోతున్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

పొదలకూరు : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కాలుష్య నియంత్రణా మండలి ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ బస్టాండ్‌లో ఆదివారం కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలను కళాకారులు హాస్యవల్లరి ద్వారా వివరించారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని, పర్యావరణానికి హానికలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం దెబ్బతిని ఊపిరితిత్తులు, కేన్సర్, తదితర వ్యాధులకు కారకాలుగా మారుతుందన్నారు. కాలుష్యం పెరిగితే ప్రాణవాయువు కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. భావితరాల మనుగడ కోసం ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానివేయాలని కోరారు. కళాకారులు విభూతి శివశంకర్, విభూతి శశిరేఖ, యడవల్లి ప్రసాద్ పాల్గొన్నారు.



కళాజాతను ప్రదర్శిస్తున్న కళాకారులు

ఆస్పత్రికెళ్లి పింఛన్ అందజేత



కోవూరు: కోవూరులోని సచివాలయం-4 పరిధిలో నివాసం ఉంటున్న గట్టమనేని సాంబశివరావు కిడ్నీ వ్యాధితో తిరుపతి సిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆయన పరిస్థితిని కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్న వెల్ఫేర్ అసిస్టెంట్ అఫ్రోజ్ తిరుపతిలోని ఆస్పత్రికి వెళ్లి సాంబశివరావుకు రూ.10వేలు పింఛన్‌ను ఆదివారం అందజేశారు. దీంతో అఫ్రోజ్‌కు సాంబశివరావు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

విద్యతో ఉన్నత శిఖరాలకు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చని కాపు హెల్పింగ్ క్లబ్ కన్వీనర్ కమతం సుబ్బారావు పేర్కొన్నారు. నగరంలోని కాపు భవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన దాదాపు 38 మంది కాపు విద్యార్థులకు రూ.1.06 లక్షల మేర ప్రోత్సాహకాలను అందజేశారు.

ముగిసిన గంగమ్మ జాతర

మనుబోలు: మండలంలోని మడమనూరులో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న గంగమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. గ్రామంలో ఏటా యాదవ సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా తొలిరోజు గంగమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. రెండో రోజు గంగపెట్టెకు పూజలు చేసి యువకులు వీరతాళ్ల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. మూడోరోజైన ఆదివారం మహిళలు బోనాలను తలమీద పెట్టుకుని ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి గంగమ్మకు నైవేద్యాలు సమర్పించడంతో జాతర ముగిసింది.



గంగమ్మ ఆలయానికి బోనాలతో తరలి వెళుతున్న మహిళలు

యువత క్రీడల్లో రాణించాలి



మనుబోలు: కప్ అందుకుంటున్న కొమ్మలపూడి జట్టు



టీపీగూడూరు: విజేతగా నిలిచిన కొత్త కాలువ జట్టుకు కప్ అందజేస్తున్న ఎస్సై



టీపీగూడూరు: కప్ అందుకున్న రన్నర్‌గా నిలిచిన విద్యాఫౌండేషన్ జట్టు

తోటపల్లిగూడూరు: యువత క్రీడల్లో రాణించాలని ఎస్సై జంపాని కుమార్ పిలుపునిచ్చారు. చిన్నచెరుకూరులో జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో కొత్త కాలువ యంగ్ ఫైటర్స్ జట్టు విజేతగా నిలిచింది. విద్యాఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నెల 15న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. 20 రోజుల పాటు సాగిన టోర్నమెంట్‌లో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 42 జట్లు తలపడ్డాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విద్యా ఫౌండేషన్ జట్టుపై కొత్త కాలువ యంగ్ ఫైటర్స్ జట్టు విజేతగా నిలిచింది. తృతీయ స్థానం కోసం జరిగిన పోటీలో డక్కులవారిపాళెం జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు ఎస్సై జంపాని కుమార్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. టోర్నమెంట్ విజేతగా నిలిచిన కొత్త కాలువ యంగ్ ఫైటర్స్ జట్టుకు రూ.50వేలు, రన్నర్‌గా నిలిచిన విద్యా ఫౌండేషన్ జట్టుకు రూ.40వేలు, తృతీయ స్థానంలో నిలిచిన డక్కులవారిపాళెం జట్టుకు రూ.30వేలు నగదు బహుమతులతో పాటు షీల్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. క్రీడలను ప్రోత్సహిస్తూ టోర్నమెంట్ విజేతకు రూ.50 వేలునగదు బహుమతిని అందజేసిన కేఆర్ చారిట్రబుల్ ట్రస్ట్ అధినేత వేలూరు కళ్యాణ్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాఫౌండేషన్ అధినేత శ్రీపతి రాము, టోర్నమెంట్ నిర్వాహకులు సంతోష్, సందీప్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు: మండలంలోని కుడితిపల్లిలో నిర్వహించిన కాకాణి రమణారెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో కొమ్మలపూడి జూనియర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో కుడితిపల్లి జట్టుపై కొమ్మలపూడి జూనియర్స్ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు అక్కంపేట మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రకటించిన రూ.15వేల నగదు బహుమతి, కప్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, చిట్టమూరు అజయ్ రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం అందజేశారు. రన్నరప్ జట్టుకు కుడితిపల్లికి చెందిన కంటి మురళి, రవి కలిసి రూ.10వేల నగదు బహుమతి, కప్‌ను అందజేశారు. టోర్నమెంట్ నిర్వాహకుడు ఆవుల తులసీరాం, వైఎస్సార్ సీపీ నాయకుడు అనమాల ప్రభాకర్‌రెడ్డి, గుంజి రమేష్, సునీల్, మధు, ఆది, తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు: కప్‌తో లింగంపల్లి జట్టు

క్రికెట్ పోటీల విజేత లింగంపల్లి జట్టు

పొదలకూరు : స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో లింగంపల్లి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో లింగంపల్లి జట్టు విజేతగా నిలిచింది. ఎమ్మార్వో కాలనీ జట్టు రన్నర్‌గా నిలిచింది. ఆదివారం విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేశారు. విజేత జట్టుకు ప్రథమ బహుమతతి రూ.10,116 నగదును ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి అందజేశారు. రన్నర్ జట్టుకు ద్వితీయ బహుమతి రూ.7,116 నగదును బిట్-4 ఎంపీటీసీ గుంటి శ్రీనివాసులురెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అనమాల వెంకటరమణారెడ్డి, వక్ఫ్‌బోర్డు జాయింట్ సెక్రటరీ ఖాదర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నవరత్నాలే శ్రీరామరక్ష



బుచ్చిరెడ్డిపాళెం: దామరమడుగులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలే వైఎస్సార్‌సీపీకి శ్రీ రామరక్ష అని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 8,9వ వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగేళ్ల పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాదాపు రూ.2 లక్షల కోట్లుతో సంక్షేమ పథకాలను అమలు చేశారని వివరించారు. సంక్షేమ పథకాలను పారదర్శకంగా అర్హులందరికీ చేరడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని గుర్తుచేశారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇప్పటి వరకు కోవూరు నియోజకవర్గంలోని 63 సచివాలయాల పరిధిలో 73,727 ఇళ్లను సందర్శించామని తెలిపారు. ప్రతి గడపలో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

దామరమడుగు పంచాయతీ పరిధిలోని పల్లిపాళెంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నిధులు రూ.5లక్షలతో పల్లిపాళెం గిరిజన కాలనీ నుంచి శ్మశానం వరకు సిమెంట్ రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. అలాగే గిరిజన కాలనీలో పోలేరమ్మ దేవస్థానాన్ని సైతం నిర్మించినట్లు చెప్పారు. స్థానికంగా ఉన్న క్రైస్తవ ప్రార్థనా మందిరానికి గ్రిల్స్ ఏర్పాటుకు తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నుంచి రూ.50 వేలు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు జయంతి, అనంతమ్మ, యానాదిరెడ్డి, మల్లారెడ్డి, రహమత్, షకీలాబేగం, సత్యనారాయణ, ప్రమీలమ్మ, నాయకులు అల్లాభక్షు, డాక్టర్ అల్లాభక్షు, చాందిని, లక్ష్మయ్య పాల్గొన్నారు.

భానుడి ప్రతాపంతో రోడ్లు వెలవెల

ముత్తుకూరు: మండల కేంద్రమైన ముత్తుకూరులో ఆదివారం భానుడి భగ భగలకు జనం విలవిల్లాడిపోయారు. వాతావరణం నిప్పుల కొలిమిలా మారడంతో ప్రధాన వీధులు పట్టపగలే నిర్మానుష్యమయ్యాయి. బజారు వీధులు, దుకాణాలు బోసిపోయాయి. ఉదయం 10 గంటల నుంచే వేసవి తాపం మొదలవడంతో జనంలో ఆరాటం మొదలైంది. పేదలు కూలీ పనులకు వెళ్లేందుకు భయపడిపోయారు. దీనికి తోడు వేడి గాలులు వీచడంతో జనం బెంబేలెత్తిపోయారు. ఇళ్లకే పరిమితమైపోయారు. రేకుల ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారు చెట్ల నీడకు చేరిపోయారు. సాయంత్రం 5 గంటలైనా సెగలు తగ్గలేదు. బస్సులు, ఆటోల్లో ప్రయాణీకులు అంతంతమాత్రంగా కనిపించారు.



మధ్యాహ్నం వేళ వెలవెలబోయిన ముత్తుకూరు ప్రధాన రోడ్డు

కోడూరు సాగరతీరంలో సందర్శకుల సందడి



తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు బీచ్‌లో ఆదివారం సందర్శకుల సందడి నెలకొంది. ఓ వైపు వేసవి సెలవులు, మరో వైపు మండుతున్న ఎండలతో ప్రజలు సేదతీరేందుకు చల్లని ప్రదేశాలకు పరుగులు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా నలువైపుల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు కోడూరు సాగరతీరానికి చేరుకోవడంతో కోలాహలం నెలకొంది. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చిన వారు గంటల కొద్ది సముద్రంలో మునుగుతూ సేదతీరారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సందర్శకుల రాకపోకలు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగాయి.

సచివాలయ సేవలపై ప్రజలకు అవగాహన

- పైలెట్ ప్రాజెక్ట్ కింద పిడూరు ఎంపిక
- డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి



మాట్లాడుతున్న పీడీ సాంబశివారెడ్డి

మనుబోలు : జిల్లాలో సచివాలయ సేవలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించే విధంగా సర్వీసెస్ పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని పిడూరు గ్రామాన్ని ఎంపిక చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో పిడూరు గ్రామ సచివాలయంలో మండలాధికారులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పిడూరు గ్రామ సచివాలయ పరిధిలో సర్వీసెస్ రిక్వెస్ట్ క్యాంపెయిన్‌ను చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా గ్రామంలోని ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఒక్కరోజులోనే సచివాలయం ద్వారా అందజేస్తామన్నారు. దీనికోసం గ్రామంలో రెండు రోజుల పాటు ఇంటింటికీ తిరిగి సర్వే చేయాలని సూచించారు. వలంటీర్లు గ్రామంలో ఎవరికి ఏ సర్టిఫికెట్ అవసరమో గుర్తించి అందుకు అవసరమైన పత్రాలను సేకరించాలన్నారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి గ్రామంలోనే సిటిజన్ ఏపీ సేవా ద్వారా సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో డీఎల్‌డీఓ వసుమతి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీఓ రాజమ్మ, ఏపీఎం వనజాక్షి, ఈఓపీఆర్డీ వెంకటరమణ, కార్యదర్శి కృష్ణవేణి, మాజీ సర్పంచ్ మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, గ్రామ పెద్ద తిక్కవరపు వెంకురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కసుమూరు, పాలిచెర్లపాడు యువత మానవత్వం

వెంకటాచలం: మండలంలోని కసుమూరు పంచాయతీ చింతలపాళేనికి చెందిన విద్యార్థినులు లతీష, అక్షిత శనివారం ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు కసుమూరు, పాలిచెర్లపాడుకు చెందిన యువత మానవత్వంతో ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. కసుమూరులో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పాలిచెర్లపాడు జట్టు విజేతగా, కసుమూరు దర్గా జట్టు రన్నర్‌గా నిలిచాయి. విజేత జట్టుకు రూ.10,116, రన్నర్ జట్టుకు రూ.5116 నగదు బహుమతులను అందజేశారు. రెండు జట్ల క్రీడాకారులు నగదు మొత్తాన్ని విద్యార్థినుల కుటుంబాలకు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

రేపు వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

పొదలకూరు : స్థానిక మారుతీనగర్‌లోని పురాతన వీరాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు రెడ్డి జనసేవా సంఘం నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, సాయంత్రం పల్లకిసేవ, రాత్రి 7 గంటలకు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.